క్లుప్తంగా

హాకీ విజేత మున్సిపల్ హైస్కూల్ జట్టు



మున్సిపల్ హైస్కూల్ హాకీ జట్టు

కర్నూలు (టౌన్): మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు హాకీ విజేతగా నిలిచింది. బుధవారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల హాకీ పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టు, మునగాలపాడు జట్టుపై 3–0 స్కోర్‌తో విజయం సాధించింది. బాలుర విభాగంలో ఆరు జట్లు, బాలికల విభాగంలో నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి సుధీర్ మాట్లాడుతూ.. విజేతలకు ఒలింపిక్ డే రోజున బహుమతులు, కప్‌లు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో భాగంగా ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ న్యూసిటీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ సాయిబాబా కోరారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన ఆటో యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన ఆటో యూనియన్ నగర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ చేపట్టే సమ్మెకు ఆటో యూనియన్‌లు సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో కె.ప్రభాకర్, బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రైలు పట్టాలపై లభ్యమైన మృతదేహం

కర్నూలు/ కర్నూలు(సెంట్రల్): దూపాడు – కోట్ల రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని శవం లభ్యమైంది. లైట్ పింక్ కలర్ ఫుల్ హ్యాండ్ రెడీమేడ్ షర్ట్, తెల్లని ఫుల్ బనియన్, నలుపు రంగు షార్ట్ వేసుకున్న మృతుడు కోట్ల రైల్వే స్టేషన్‌కు దక్షిణముఖాన 25 మీటర్ల దూరంలో చనిపోయి ఉన్నాడు. తెల్లవారుజామున 4.30 గంటల కంటే ముందుగా చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉంటుంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు విచారణ చేస్తున్నారు. అతని శవాన్ని గుర్తు పట్టిన వారు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి(99088 89696), కర్నూలు ప్రభుత్వ రైల్వే డబ్ల్యూఎస్ఐ కె.కుమారి (83670 37525) ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ టీసీ మాధవస్వామి తెలిపారు.

నీట్ ర్యాంకర్‌కు కలెక్టర్ అభినందన



విద్యార్థి మహ్మద్ సోహేల్‌ను అభినందిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): నీట్–2025 పరీక్షా ఫలితాల్లో 640/720 మార్కులు సాధించిన మాంటిస్సోరి పాఠశాల పూర్వ విద్యార్థి మహ్మద్ సోహేల్‌ను కలెక్టర్ పి.రంజిత్‌బాషా అభినందించారు. ఆలిండియా స్థాయిలో 133వ ర్యాంకు సాధించిన సోహేల్, పాఠశాల బృందం బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలవగా అభినందించి శాలువా కప్పి సన్మానించారు. భవిష్యత్‌లోనూ మంచి విజయాలుసాధించాలని ఆకాంక్షించారు. సోహేల్ 10వ తరగతి వరకు ఏక్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో చదివారు. పాఠశాల డైరెక్టర్ కె.రాజశేఖర్, ప్రిన్సిపాల్ రమాజ్యోతి పాల్గొన్నారు.

దినచర్యలో క్రీడలు భాగం కావాలి




హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న శమంతకమణి

కర్నూలు (టౌన్): విద్యార్థుల దినచర్యలో క్రీడలు అంతర్భాగంకావాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఒలింపిక్ డే రన్ క్రీడోత్సవాల్లో భాగంగా వాలీబాల్, హ్యాండ్‌బాల్, యోగా పోటీలను నిర్వహించారు. పోటీలను రాష్ట్ర యోగా చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, ఒలింపిక్ సంఘం సీఈఓ విజయకుమార్‌తో కలిసి ప్రారంభించారు. మాట్లాడుతూ అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని, ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థినీ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ఈ నెల 23న నిర్వహించే ఒలింపిక్ రన్‌లో పెద్ద ఎత్తున్న క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, నిర్వహణ కార్యదర్శి సునీల్ కుమార్, హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి రుద్రారెడ్డి అవినాష్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్‌తో చిక్కిశల్యం

- చిన్నారుల్లో అరుదైన రక్తవ్యాధి
- పలు రకాల అనారోగ్య ఇబ్బందులు
- పెన్షన్‌తో ఆదుకున్న గత ప్రభుత్వం
- నేడు జాతీయ సికిల్‌సెల్ వ్యాధి అవగాహన దినం



గుండ్రంగా ఉన్నవి ఎర్ర రక్త కణాలు, కొడవలి ఆకారంలో ఉన్నవి సికిల్‌సెల్ రక్త కణాలు

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా మనిషి రక్తంలోని ఎర్ర రక్త కణాలు గుండ్రటి ఆకారంలో ఉంటాయి. కానీ సికిల్‌సెల్ వ్యాధి వచ్చిన వారిలో మాత్రం ఇవి కొడవలి ఆకారంలో ఉంటాయి. ఇవి శరీరమంతా వ్యాపించి పలు అనారోగ్యాలకు దారి తీసేలా చేస్తుంటాయి. పుట్టుకతోనే సోకే ఈ వ్యాధి జీవితాంతం వారిని వేధిస్తుంది. ఆడుతూ పాడుతూ తిరగాల్సిన చిన్నారులు ఈ వ్యాధి కారణంగా ఏ పనీ చేతగాక నిస్సత్తువతో ఒకేచోట కుప్పకూలిపోతుంటారు. సమాజంలో అరుదైన ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 19న జాతీయ సికిల్‌సెల్ వ్యాధి అవగాహన దినం నిర్వహిస్తున్నారు.

ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉండి మనిషి శరీరమంతా ప్రయాణించి వివిధ అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తాయి. కాగా కొంత మందిలో ఈ కణాలు కొడవలి ఆకారంలోకి మార్పు చెంది ఉంటాయి. దీనినే సికిల్‌సెల్ వ్యాధిగా వైద్యులు పిలుస్తారు. ఈ వ్యాధి ఉన్న వారి రక్త కణంలోని ఒక జన్యువు సికిల్ సెల్‌గా, మరొకటి మామూలుగా ఉంటే అలాంటి వారిని సికిల్‌సెల్ క్యారియర్లు ఉంటారు. వీరికి మామూలుగా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. అయితే వివాహం చేసుకున్న దంపతులు ఇద్దరికీ ఇలాంటి లక్షణాలు ఉంటే వారికి జన్మించే పిల్లలకు రక్త కణంలోని రెండు జన్యువులూ వంపు తిరిగి ఉంటాయి. అలాంటి పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. సాధారణ రక్తకణాల జీవిత కాలం 120 రోజులైతే సికిల్‌సెల్ రక్తకణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే. ఇవి నశించి పోయేంత వేగంగా కొత్త ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి ఉన్నవారు రక్త హీనతకు గురవుతారు. అంతేగాక సికిల్ రక్తకణాలు వంపు తిరిగి ఉండటం వల్ల సన్నటి రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సిజన్ అందడం తగ్గిపోతుంది. ఈ కారణంగా ఈ వ్యాధి గ్రస్తులు తగిన చికిత్స తీసుకోకపోతే 15 ఏళ్లలోపే మరణించే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు 40 మందికి పైగా ఉన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఇలాంటి వ్యాధిగ్రస్తులు ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి అరుదైన వ్యాధి ఉన్న వారికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా రూ.10 వేల ప్రత్యేక పెన్షన్ ఇచ్చి ఆదుకున్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్ష

ఈ వ్యాధి నిర్ధారణకు ప్రాథమిక రక్త పరీక్ష ఖరీదు తక్కువలోనే ఉంటుంది. రక్త నమూనాను సోడియం మెటాబైసల్ఫేట్‌లో కలిపి మైక్రోస్కోప్ కింద చూస్తే రక్తకణాలు గుండ్రంగా ఉన్నాయా? వంపు తిరిగి ఉన్నాయా తెలుసుకోవచ్చు. తద్వారా ఆ వ్యక్తికి సికిల్‌సెల్ వ్యాధి ఉందో లేదో నిర్ధారిస్తారు. జన్యుపరమైన ఈ వ్యాధికి ఇప్పటివరకు మందు లేదు. సికిల్‌సెల్ క్యారియర్లుగా గుర్తించి, వారి మధ్య వివాహాలను నిరోధించడం ద్వారా ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగకుండా నియంత్రించవచ్చు.

వ్యాధి లక్షణాలు

- దీర్ఘకాలం పాటు కామెర్లు ఉంటాయి
- రక్తహీనతతో శరీరం పాలిపోయి ఉండటం, కాళ్లు, చేతి వేళ్ల వాపుతో వంపు తిరిగి ఉండటం, ప్లీహం వాచిపోయి ఉండటం, నీరసం, తిమ్మిర్లు, డార్క్ ఐస్, చర్మం ముడతలు పడటం వంటి లక్షణాలు ఉంటాయి
- శిశువుకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. వయస్సు పెరిగే కొద్దీ లక్షణాలు కనిపిస్తాయి.
- ఆక్సిజన్ సరఫరా సరిగా లేకపోవడంతో శరీరంలో ఏదైనా ఒక భాగంలో తీవ్రమైన నొప్పి కలుగుతుంది.
- కౌమార దశలో ఉన్నవారు, పెద్దవారు దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతూ ఉంటారు.

సికిల్‌సెల్‌తో పలు రకాల జబ్బులు



సికిల్ సెల్ వ్యాధి వంశపారపర్యంగా వస్తుంది. ఇది రక్తనాళాల్లో వచ్చే వ్యాధి. జీవితాంతం ఉంటుంది. దీన్ని ముందస్తుగా నిర్ధారణ చేసుకుని చికిత్స తీసుకుంటే మేలు. ఈ వ్యాధిలో శరీరంలో రక్తసరఫరా సరిగ్గా జరగక ఇబ్బందులు వస్తాయి. రక్తనాళాల్లో విపరీతమైన నొప్పులు, వాంతులు, కీళ్ల నొప్పులతో పాటు ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీ, కాలేయం వంటివి ఎఫెక్ట్ అవుతూ ఉంటాయి. ఈ వ్యాధిగ్రస్తులు వైద్యులు సూచించిన మేరకు రెగ్యులర్‌గా మందులు వాడాలి.
– డాక్టర్ కె.విద్యాసాగర్, ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



తల్లిదండ్రుల్లో ఇద్దరికీ సికిల్‌సెల్ వ్యాధి ఉంటే వారికి పుట్టబోయే శిశువుకు సైతం ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే గర్భం దాల్చక ముందే పుట్టబోయే శిశువుకు ఈ వ్యాధి రాకుండా తల్లికి ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తాం. గర్భం దాల్చిన తర్వాత వస్తే బిడ్డకు వచ్చే అవకాశం ఉందా, లేదా అని తెలుసుకోవడానికి ఉమ్మ నీరును పరీక్షకు పంపిస్తాం. ప్రసవం తర్వాత అయితే బిడ్డకు పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తాం. ఈ వ్యాధి ఉంటే అవసరమైన చికిత్స అందిస్తాం. గర్భిణిగా ఉన్నప్పుడు సికిల్‌సెల్ ఉంటే నెలలు నిండకముందే బిడ్డ జన్మించే అవకాశం ఉంది. దీనివల్ల శిశువు బరువు తక్కువగా ఉంటుంది. ఒక్కోసారి అబార్షన్ అయ్యే అవకాశం కూడా ఉంటుంది. – డాక్టర్ టి.జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు

సీఎస్ఆర్ఎంఓ బీవీ రావు బదిలీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన్ను గుంటూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ చేశారు. అక్కడ సీఎస్ఆర్ఎంఓగా పనిచేస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ అయ్యారు.

నేడు వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): ఒలింపిక్ డే పురస్కరించుకొని గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న వ్యాయామ హాలులో జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి షేక్షావలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బాలికలకు, 11 గంటలకు పురుషులకు పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. విజేతలకు ఒలింపిక్ డే పురస్కరించుకొని పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

డీఎస్‌డీఓకు ఆర్‌టీఐ నోటీసులు

– నేడు మంగళగిరి కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ ఉత్తర్వులు

కర్నూలు(టౌన్): జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావుకు రాష్ట్ర సమాచార హక్కు చట్టం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 19న గురువారం మంగళగిరిలోని సమాచార హక్కు కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం నిర్వహక కార్యదర్శి సునీల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా శిక్షణ కార్యక్రమాలు, స్టేడియం ఆదాయం వివరాలు, ఏటా జరిగే ఆడిట్ రిపోర్టు, రసీదులు తదితర వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా వివరాలు ఇవ్వకుండా స్టేడియం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు చెప్పారు. దీంతో రెండో అప్పీల్‌గా రాష్ట్ర క్రీడా శాఖను సమాచారం కోసం సంప్రదించగా ఇక్కడ కూడా స్పందన లేదన్నారు. చివరకు ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్‌ను ఆశ్రయించానని రెండు నెలల అనంతరం కమిషన్ స్పందించి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

జెడ్పీలో 38 మందికి కారుణ్య నియామకాలు

కర్నూలు అర్బన్: జిల్లా పరిషత్, మండల పరిషత్ యాజమాన్య పరిధిలోని వివిధ ప్రదేశాలలో జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో పనిచేసి మృతిచెందిన వారి కుటుంబసభ్యులు 38 మందికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించినట్లు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి జెడ్పీ సీఈఓ జి.నాసర రెడ్డితో కలిసి ఆయన ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్, సీఈఓ మాట్లాడుతూ.. కారుణ్య నియామకాల కోసం అర్హులైన వారు 2017 సంవత్సరం నుంచి జూనియర్ అసిస్టెంట్/ టైపిస్టు పోస్టులకు వారి విద్యార్హతల మేరకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అయితే జూనియర్ అసిస్టెంటు/ టైపిస్టు పోస్టులు ఖాళీగా లేకపోవడం వల్ల చాలా మంది ఆఫీసు సబార్డినేట్ పోస్టులలో నియామకం తీసుకున్నారని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం జూనియర్ అసిస్టెంటు/ టైపిస్టు పోస్టులను జూనియర్ ఆఫీసుఅసిస్టెంటుగా పేరు మార్చి ఆయా పోస్టులకు టైప్ రైటింగ్ అర్హతను తీసివేసిందన్నారు. వాటి స్థానంలో కంప్యూటర్ ప్రొఫెషనరీ టెస్ట్ (సీపీటీ) ఉత్తీర్ణత సాధించాలనే నిబంధనలను పెట్టిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు, దరఖాస్తుదారుల కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మానవతా దృక్పథంతో ఆలోచించి వారి విద్యార్హతల మేరకు జూనియర్ సహాయకులు/టైపిస్టులుగా ఉద్యోగాలకు ఎంపికచేసి నియామక పత్రాలను అందించి జెడ్పీ పరిధిలోని వివిధ కార్యాలయాలకు పోస్టింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగాలు పొందిన వారిలో జూనియర్ ఆఫీసుఅసిస్టెంటు – 4, జూనియర్ ఆఫీసు అసిస్టెంటు (టైపిస్టు) – 27, ఆఫీసు సబార్డినేట్‌లుగా 7 మందికి నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారులు నాగేంద్రప్రసాద్, మురళీమోహన్ రెడ్డి, అబ్దుల్ హక్ ఉన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ముగిసిన బదిలీల కౌన్సెలింగ్



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కౌన్సిలింగ్‌కు హాజరైన స్టాఫ్ నర్సులు

కర్నూలు (హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు బుధవారం సాయంత్రం బదిలీల కౌన్సెలింగ్ ముగిసింది. రెండు రోజులుగా జరుగుతున్న ఈ కౌన్సెలింగ్‌లో మొత్తం 150 మందికి పైగా ఉద్యోగులను బదిలీ చేశారు. రెండో రోజు 76 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం జూనియర్ అసిస్టెంట్, ఎల్‌డీ కంప్యూటర్స్, ఆఫీస్ బేరర్లు, మధ్యాహ్నం ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ, క్లీనర్లు, వాచ్‌మెన్లు, తోటీలు, హెల్పర్లు, స్వీపర్లు, ఫ్యామిలీ వెల్ఫేర్ వర్కర్లు, వాటర్ మ్యాన్లు, స్ట్రెచర్ బేరర్లు, స్వీపర్లు, ఫీమేల్ అటెండెంట్, ఎక్స్‌రే అటెండెంట్, ల్యాబ్ అటెండెంట్లు ఉన్నారు. వీరందరికీ జూమ్ ద్వారా డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ ఆధ్వర్యంలో ఏఓ అరుణకుమారి, సూపరింటెండెంట్ పి.శ్రీనివాసులు, తదితరులు కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయించారు.

అర్ధాంతరంగా నిలిచిన జోనల్ స్థాయి బదిలీలు

జోనల్ స్థాయిలో నిర్వహిస్తున్న బదిలీల కౌన్సిలింగ్ బుధవారం సాయంత్రం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఏపీ హంస అసోసియేషన్‌కు కోర్టు నుంచి గుర్తింపు రావడంతో ఆ సంఘాన్ని సైతం బదిలీల్లో అనుమతించాలని సూచనలు రావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం నుంచి హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో 58 స్టాఫ్ నర్సు ఖాళీలను చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీంతో పీహెచ్‌సీలో పనిచేస్తూ ఇక్కడికి రావాలనుకున్న వారు నిరాశకు గురయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న 20 మందిలో నలుగురు రిటైన్ కాగా, 16 మంది బదిలీ అయ్యారు. వీరి బదిలీ కౌన్సెలింగ్ జరుగుతున్న సమయంలో ఏపీ హంసకు సంబంధించి ఉత్తర్వులు రావడంతో గురువారం తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటుకు ఇవ్వొద్దు

కర్నూలు(సెంట్రల్): మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని టాటా సంస్థకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని, ఆ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని కోరారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశాన్ని లీలావతి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకంపై ఎంతో మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ఆ పథకాన్ని టాటా సంస్థకు అప్పగించేందుకు పావులు కాదపడమంటే వారిందరీ కడుపులు కొట్టడం అవుతుందన్నారు. 23 సంవత్సరాల నుంచి వంట ఏజెన్సీలు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, భారతి, సరోజమ్మ, అంబుబాయి, అనసూయమ్మ, మాణిక్యమ్మ, సోఫియా, శంకరమ్మ పాల్గొన్నారు.

రీ-కౌన్సెలింగ్ చేయాలి

కర్నూలు (హాస్పిటల్): ఏపీ హంస గుర్తింపునకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో బదిలీలను తిరిగి నిర్వహించాలని ఆ సంస్థ కర్నూలు నగర అధ్యక్షుడు గోవిందు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సాధారణ బదిలీల్లో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ హంస గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేయడం వల్ల బదిలీల్లో సంఘ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఈ విషయమై ఏపీ హైకోర్టును అభ్యర్థించగా ప్రభుత్వ రిట్ పిటిషన్‌ను తాత్కాలికంగా నిలిపివేసిందన్నారు. తక్షణమే హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా బదిలీల్లో రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

అతిసారం ప్రబలకుండా చర్యలు

కర్నూలు(హాస్పిటల్): అతిసార వ్యాధి ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. ఆయన బుధవారం కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని బావాపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసార వ్యాధి వ్యాప్తి చెందకుండా, మరణాలు తగ్గించేందుకు స్టాప్ డయేరియాపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓఆర్ఎస్ తయారీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, చేతుల శుభ్రతపై చైతన్యపరచాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, రోడ్డుపై విక్రయించే పానీయాలకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ మంజూష, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు దానమ్మ, సామాజిక ఆరోగ్య అధికారి నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ సూత్రాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, తదితరులు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో వృక్షశాస్త్రం అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ దండుగుల మధు సుధాకర్ రచించిన 'సేంద్రియ వ్యవసాయ సూత్రాలు' అనే పుస్తకాన్ని బుధవారం ఆ కాలేజీలో ఆవిష్కరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి, వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, అధ్యాపకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. రసాయనాలతో చేస్తున్న వ్యవసాయం ఎన్ని అనర్థాలకు దారితీస్తుందో అనేక పరిశోధనలు చెబుతున్నాయన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను అర్జించేందుకు, ఆరోగ్యకరమైన పంటలను పడించేందుకు చక్కగా ఉపయోపడేలా పుస్తకాన్ని రాశా రని రచయితను అభినందించారు. రచయిత మా ట్లాడుతూ.. వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని క్రమేణా తగ్గిస్తూ నేల సారవంతాన్ని కాపాడుతూ ప్రకృతి సమతుల్యత దెబ్బదినకుండా, దిగుబడిని పెంచడం ఎలా వివరిస్తూ పుస్తక రూపంలో తీసుకొచ్చినట్లు చెప్పారు. కొన్ని ప్రతులను కాలేజీ గ్రంథాలయానికి అందజేశారు. అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాలను సద్వినియోగం చేసుకోండి



రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని 1127 మంది రైతులకు రూ.2.42 కోట్ల సబ్సిడీ విలువ చేసే యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల ఉత్పాదకతను పెంచడంలో వ్యవసాయ యంత్రీకరణ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వ్యవసాయంలో రైతుల సాగు ఖర్చులు తగ్గించడం, కార్మికకుల కొరతను తీర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరంలో 314 గ్రామాలకు చెందిన 1127 మంది సన్న, చిన్నకారు రైతులకు రూ.2.42 కోట్ల సబ్సిడీతో బ్యాటరీ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రోటవేటర్లు, పవర్ వీడర్లు, బండ్ ఫార్మర్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. వీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. జిల్లాలో 35 డ్రోన్‌ల ఏర్పాటు లక్ష్యంగా ఉందని, అంతకంటే ఎక్కువ మంది రైతులు ముందుకు వస్తే వారితో గ్రూపులు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించాలని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీకి సూచించారు. డ్రోగో కంపెనీ జీఎం చాంద్‌బాషా పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతంచేసేందుకు కృషి చేస్తామని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ సభ్యుడు ఎం.సుధాకరబాబు అధ్యక్షతన నాయకుల సమావేశం జరిగింది. ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిళ చేసిన సూచనలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని సుధాకరబాబు తెలిపారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీబాషా, నాయకులు దామోదరం రాధాకృష్ణ, కాశీంవలి, క్రాంతినాయుడు, రమేష్ యాదవ్, అనంతరత్నం, బి.మహేంద్రనాయుడు, బజారన్న పాల్గొన్నారు.

20న స్విమ్మింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): ఒలింపిక్స్ డే పురస్కరించుకొని ఈ నెల 20న నగరంలోని ఓల్డ్ రఘునాథ్ టాకీస్ వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో అండర్–18 విభాగంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధి జేఎల్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో 18 ఏళ్లల్లోపు క్రీడాకారులకు పోటీలు ఉంటాయని, వివరాలకు 9440251668 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఔత్సాహికులతో వీసీ

కర్నూలు కల్చరల్: యోగాతో మానసిక ఒత్తిడులు దూరమై సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు అన్నారు. యోగాంధ్ర –2025 మాసోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా వర్సిటీలో రెండో రోజు బుధవారం నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌కు ఆయన హాజరైన మాట్లాడారు. నాలుగు రోజుల వర్క్‌షాప్‌కు విశేష స్పందన లభిస్తోందన్నారు. వివేకానంద కేంద్ర సంయోజకులు జి.పుల్లయ్య, ఎస్.శివప్రసాద్ యోగా ప్రాముఖ్యతను వివరించారు. శిక్షకులు అమరీష్ వివిధ యోగాసనాలను అభ్యాసం చేయించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు, సీడీసీ, ఎగ్జామినేషన్స్ డీన్ ఆచార్య పీవీ సుందరానంద్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.కె వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజలు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు ప్రభుత్వం యోగా సాధనను చేపట్టిందన్నారు. 21వ తేదీన జరుగనున్న యోగా డే కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాళ్లు జి.శ్రీనివాస్, వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు ప్రసాద్ రెడ్డి, హేమంత్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కార్యక్రమాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈ నెల 16 నుంచి జులై 31వ తేదీ వరకు డయేరియా (అతిసార వ్యాధి)పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ఆమె బుధవారం తన చాంబర్‌లో అవగాహన కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. నీరు కలుషితం కావడం వల్ల ప్రజలకు వాంతులు, విరేచనాలు మొదలై అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఆశా కార్యకర్తలు వారి పరిధిలోని ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంట్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. రెండు, మూడు రోజులైనా డయేరియా తగ్గకపోతే జింక్ మాత్రలు తప్పనిసరిగా 14 రోజులపాటు వాడాలని తెలిపారు. పిల్లలకు డయేరియా వస్తే ముందుగా ఎవరిని సంప్రదించాలి, ఇంట్లోనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేసుకోవాలి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏఏ ప్రదేశాలల్లో అందుబాటులో ఉంటాయో అవగాహన కల్పించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు, కార్యాలయ పరిపాలన అధికారి అరుణ, డెమో శ్రీనివాసులు శెట్టి, ఎస్ఓ హేమసుందరం, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ఆధార్ జారీపై అవగాహన



మాట్లాడుతున్న డీసీపీఓ శారద

కర్నూలు (అర్బన్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి ఆదేశాల మేరకు బుధవారం ఇందిరాగాంధీ నగర్‌లో స్వాతి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీఓ శారద మాట్లాడుతూ.. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ దిశా నిర్దేశాలతో నిరాశ్రయులైన అనాథ పిల్లలను గుర్తించి వారికి ఆధార్ కార్డులను జారీ చేయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్వాతి కమిటీ సభ్యులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన విద్య, వైద్యం, పునరావాసం షెల్టర్ హోమ్‌లో ప్రవేశం కల్పించడం, స్కాలర్‌షిప్స్, మిడ్ డే మీల్స్ సదుపాయాల అర్హత కల్పించడం కోసం రోడ్డు పక్కన నివశిస్తున్న పిల్లలు, అనాథలు, తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారిని గుర్తించి వారికి ఆధార్ కార్డు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన పిల్లలకు ఉచిత న్యాయ సలహాలను అందించడం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.